
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
శుక్రవారం 13 జూన్ 2025





30న షర్మిల భీమవరం రాక

పాలకొల్లు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి):పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 30న భీమవరం రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరి కుమార్‌రాజు తెలిపారు. పాలకొల్లు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు నిర్వహించే సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు యడ్ల శివాజీ, నిజయోజకవర్గ కన్వీనర్ కొరగింజల హరి కిరణ్, బోణం వెంకట్రావు, డాక్టర్ వై.నామగిరి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 50.24 శాతం ఉత్తీర్ణత

భీమవరం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి):పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల చేశారు. మొత్తం 4,570 మంది విద్యార్థులకు 2,296 మంది అంటే 50.24 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 2879 మందికి 1,338, బాలికలు 1691 మందికి 958 మంది ఉత్తీర్ణత సాధించారు.

డీఎస్సీ పరీక్షకు 31 మంది గైర్హాజరు

జిల్లాలో మూడు కేంద్రాల్లో గురువారం జరిగిన మెగా డీఎస్సీలో 727 మందికి 696 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 366 మందికి 348, మధ్యాహ్నం సెషన్‌లో 361 మందికి 348 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

నేటి నుంచి విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు

భీమవరం టౌన్ : విద్యార్థులకు శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సు పాస్‌లు సరికొత్త విధానంలో అందిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. విద్యార్థులు యధావిధిగా తీసుకోవచ్చన్నారు.

తల్లుల ఖాతాల్లో.. నేడే.. తల్లికి వందనం

నిధులు విడుదల చేసిన ప్రభుత్వం.. బ్యాంకుల్లో జమ

తొలి విడతగా 1,76,574 మంది పిల్లలకు లబ్ధి.. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు మినహా

ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున.. ఇంటిలో ఎంత మంది పిల్లలు వుంటే అందరికి..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తల్లులకు శుభవార్త. తల్లికి వందనం పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేసింది. జిల్లాలోని అర్హులైన 1,76,574 మంది విద్యార్థులు ఉండగా ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున వారి తల్లులు 1,16,182 మంది ఖాతాల్లో ఈ రోజు సాయంత్రానికి జమ చేయనుంది. వాస్తవానికి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు, ఇంటర్ విద్యార్థులు సుమారు 2.42 లక్షల మంది ఉన్నారు. ప్రస్తుతం ఒకటో తరగతిలో చేరే వారికి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం పొందిన వారికి మినహా మిగిలిన వారికి మాత్రమే ఇవ్వనున్నారు. రెండు నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు 1,76,574 మందికి తొలి విడతగా లబ్ధి కలుగనుంది. తాజాగా సిద్ధమైన జాబితాకు సంబంధించి తల్లుల ఖాతాలో రూ.229.55 కోట్లు జమ కానున్నాయి. విద్యార్థుల ఆధార్ కార్డుకు తల్లిదండ్రుల ఆధార్ కార్డు వివరాలను లింక్ చేశారు. ఇలా లింకు అయిన తల్లుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ కానున్నాయి. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన విధంగానే ఎంత మంది పిల్లలున్నా సరే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ముందుగా ప్రకటించినట్టు రూ.15 వేలు కాకుండా 2,000 పాఠశాలల నిర్వహణకు మినహాయించి విద్యార్థికి రూ.13 వేలు చొప్పున జమ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకానికి అనుసరించిన నిబంధనలనే ఇప్పుడు అమలు చేస్తున్నారు. పరిమితికి మించి ఇంటి స్థలాలు ఉన్నా, ఆదాయపు పన్ను చెల్లింపు, విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చినా ఈ పథకం వర్తించదు.

ఏలూరు జిల్లాలో

ఏలూరు జిల్లాలో అర్హులైన 2,15,082 మంది విద్యార్థులకుగాను 1,40,764 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయనున్నారు. ఒకటి, ఇంటర్ ఫస్టియర్‌లోకి అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల సంఖ్యను ఈ పథకానికి జోడించాల్సి ఉంది. వీరు దాదాపు 35 వేల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు.



సుపరిపాలన.. సంబరాలు

కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా గురువా రం సంబరాలు జరిగాయి. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కేడర్ సమక్షంలో కేక్‌లు కట్ చేసి ఉత్సాహం ప్రదర్శించారు. పలుచోట్ల భారీ ప్రదర్శనలు నిర్వహిం చారు. ఉదయాన్నే ఎన్టీఆర్ విగ్రహాలకు అన్ని చోట్ల పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తణుకులో పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను చిత్రంలో చూడవచ్చు. 6లో..

ఆహా.. ఏమి రుచి

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

(భీమవరం రూరల్/పెంటపాడు-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. మొదటిరోజు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. పౌర్ణమి తర్వాతి వచ్చే పాడ్యమి మంచిరోజు కావడంతో పిల్లలను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపారు. జిల్లాలో 1392 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో సగం మందికిపైగా విద్యార్థులు మొదటిరోజు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. మరోవైపు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు తీసుకువచ్చాయి. ఇప్పుడు సన్న బియ్యం ఉపయోగించడం విద్యార్థులు భోజనం ఇష్టంగా మారింది. జిల్లాలోని 1392 ప్రభుత్వ పాఠశాలల్లో 98 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి రుచికరమైన, పోషకాలు కలిగిన భోజనం మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ విద్యా సంవత్సరం మొదటిరోజే సన్నబియ్యంతో భోజనం అందించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సన్నబియ్యం భోజనాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి వారు మధ్యాహ్న భోజనం చేశారు.

సంతోషంగా.. తృప్తిగా భోజనం చేశాం



- మా స్కూల్‌లో గతంలో భోజనం ఒక్కోసారి ఇబ్బందిగా ఉండేది. ఈ రోజు సన్న బియ్యంతో చేసిన భోజనం తిన్న తర్వాత గతంతో పోలిస్తే చాలా బాగుంది. అందరం తృప్తిగా తిన్నాం. మాకు పుస్తకాలు ఇచ్చారు. తీసుకున్నాం. మా స్కూల్‌లో చదువు బాగా చెబుతారు.

  - వి.సందీప్, ఆదర్శ పాఠశాల పెంటపాడు

చాలా రుచిగా ఉందన్న విద్యార్థులు

తొలి రోజు 1392 పాఠశాలల్లో 98 వేల మందికి



- సన్నబియ్యం అన్నం చాలా బాగుంది. నేను మా ఫ్రెండ్స్ అందరం కూడా సంతోషంగా భోజనం చేశాం. గతంలో వండిన అన్నం కొన్ని సార్లు ముద్దలుగా ఉండిపోయేది. బియ్యం కారణంగానే ఈ సమస్య వచ్చేది. ఇప్పుడు మాకు ఆ ఇబ్బంది లేదు. సన్నబియ్యం తో తృప్తిగా భోజనం చేస్తాం.

  - కె.అక్షయ, పెంటపాడు



- సన్నబియ్యంతో భోజనం ఇంటి భోజనంగా ఉంది. మంచి చదువుతోపాటు రుచికరమైన భోజనం మధ్యాహ్న భోజన పథకంలో అందించడం చాలా ఆనందంగా ఉంది.

  - దుర్గా, విద్యార్థిని, భీమవరం



- గత విద్యా సంవత్సరం చివరి నుంచి మధ్యాహ్న భోజనంలో మెనూ మార్చి పోషకాలు కలిగిన కూరలు పెట్టారు. గతంలో అలా ఉండేవి కాదు. ఇప్పుడు సన్న బియ్యం అన్నం పెట్టడం ఇంకా బాగుంటుంది.

  - కీర్తన, భీమవరం

మిగతా 6లో..



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబు

రోజూ ప్రత్యేక మెనూ

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు, జేసీ రాహుల్

భీమవరం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు పౌష్టికాహారం లోపం లేకుండా ఉండేలా మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజు ప్రత్యేక మెనూను అమలు చేస్తున్నట్టు పబ్లిక్‌అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భీమవరం పీఎస్‌ఎం బాలికోన్నత మునిసిపల్ హైస్కూల్‌లో సన్న బియ్యంతో తయారుచేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. భోజనం నాణ్యతను విద్యార్థినులను అడిగి తెలుసుకుని, వారితో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనతోపాటు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించడమే లక్ష్యమన్నారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను అందించారు. ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మోగిన బడి గంట

ఎంతో ఆనందంగా స్కూలుకు వస్తున్న విద్యార్థినులు..



రుచికరమైన భోజనం

ఒకే స్కూలు మాకొద్దు



ఉపాధ్యాయ దంపతుల అయిష్టత !

- ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్‌లో విచిత్రం
- స్పౌజ్ నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయలేమంటున్న విద్యాశాఖ

ఏలూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ దంపతులిద్దరూ ఒకేచోట ఉద్యోగ విధులుంటే ఎంతో సంతోషిస్తారు. చాలా మంది ఇదే కోరుకుంటారు. రికమండేషన్లు తెచ్చుకుంటారు. తెలిసిన వారితో సిఫారసు చేయించుకుంటారు. దీనికి భిన్నంగా ప్రస్తుతం జరుగుతోన్న ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లతో దరఖాస్తు చేసుకున్న టీచర్లలో కొందరు తమ జీవిత భాగస్వామి పనిచేస్తున్న పాఠశాలలో వెకెన్సీ ఉన్నప్పటికీ అక్కడకు బదిలీ కోరుకునేందుకు లేదా ఐచ్ఛికాన్ని ఇచ్చేందుకు అయిష్టత చూపిస్తుండడం అటు విద్యా శాఖ, ఇటు ఉపాధ్యాయ వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి.

తొలి ప్రాధాన్యత ఇదే

నిబంధనల ప్రకారం స్పౌజ్ పాయింట్లతో బదిలీ కోరుకునే టీచర్లలో జీవిత భాగస్వామి ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలోనే వెకెన్సీ ఉంటే తొలి ప్రాధాన్యతగా అదే స్థానానికి ఐచ్ఛికాన్ని ఇచ్చి కోరుకోవాలి. అక్కడ వెకెన్సీ లేకపోతే సమీప స్కూలు లేదా ప్రాంతం లేదా అదే మండలం.. ఇలా ప్రాధాన్యతా క్రమంలో పాఠశాలను ఎంచుకోవాలి. కానీ గురువారం జరిగిన ఎస్జీటీల బదిలీల్లో పలువురు స్పౌజ్ పాయింట్లను వినియోగించుకుంటూనే జీవిత భాగస్వామి పనిచేస్తున్న స్కూలులో వెకెన్సీ ఉన్నప్పటికీ ఐచ్ఛికాన్ని ఇవ్వకుండా సమీప ప్రాంతాల్లోని పాఠశాలలను ఎంచుకున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వెకెన్సీలను ఖరారు చేయలేమంటూ విద్యా శాఖ వర్గాలు తిరస్కరించగా, పలువురు ఉపాధ్యాయులు మద్దతుగా నిలవడం గమనార్హం. స్పౌజ్ పాయింట్లతో బదిలీ కోరుకున్న వారికి జీవిత భాగస్వామి పనిచేస్తున్న స్కూలుకు లేదా సమీప స్కూలుకు ఐచ్ఛికాన్ని ఇచ్చుకునేలా ఉపాధ్యాయ సంఘాలు, విద్యాశాఖ శ్రమించాల్సి వచ్చింది.

ఇదీ మా సమస్య

స్పౌజ్ ఉపాధ్యాయ దంపతుల వాదన మరోలా ఉంది. ఒకే స్కూలులో దంపతులిద్దరూ ఉంటే సెలవుకు దరఖాస్తు చేసుకోవడానికి ఇద్దరికీ ఒకేసారి అవకాశం ఉండబోదని, ఈ పరిస్థితి ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురు పనిచేసే టీచర్లున్న చోట స్పష్టంగా కనబడుతుందని చెబుతున్నారు. ఈ సాంకేతిక అవరోధాలను అధిగమించేందుకే వేర్వేరు స్కూళ్లను ఎంపిక చేసుకోవాల్సి వస్తోందని వారు తమ చర్యలను సమర్థించుకున్నారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్

ఉమ్మడి జిల్లా ఎస్జీటీలకు స్థానిక జడ్పీ మీటింగ్ హాలులో జరుగుతున్న మాన్యువల్ కౌన్సెలింగ్ గురువారం ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తలేదు. రెండో రోజు 900 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, రాత్రి 10 గంటల సమయానికి 776 సీనియార్టీ నంబరు వరకు పూర్తయింది. శుక్రవారం మరో 800 మంది ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఆర్జేడీ నాగమణి కౌన్సెలింగ్ తీరును పరిశీలించారు.

ఉపాధి హామీతో అందరికి సాయం

- 18 ఏళ్లు నిండిన గ్రామస్తులు అర్హులు
- వంద రోజుల పని దినాలు కల్పిస్తాం
- రూ.52 కోట్లతో 460 సీసీ రోడ్ల నిర్మాణం
- లక్షా 87 వేల మందికి జాబ్ కార్డులు
- ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్



(భీమవరం టౌన్-ఆంధ్రజ్యోతి)

'గ్రామీణ ప్రాంతంలో నివాసం ఉంటూ 18 ఏళ్లు నిండినవారు ఉపాధి హామీ పథకానికి అర్హులు. ఎంత మంది వచ్చినా వారికి జాబ్ కార్డులు అందిస్తాం. 100 రోజుల పనిదినాలు కల్పిస్తాం. కార్డు పొందిన వారికి ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా అనేక పథకాలను ప్రభుత్వం అందిస్తోంది. వాటి ద్వారాకూడా ఆదాయం పొందే అవకాశం ఉంది. ఇటువంటి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలి' అని డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమంలో పలువురు ఫోన్ ద్వారా సమస్యలను, సందేహాలను ప్రస్తావించారు. వారికి ఆయన సమాధానాలు చెప్పారు.

- **ఎన్‌ఆర్‌జీఎస్‌లో పశుగ్రాసం పెంచుకోవచ్చునా ?**

  - దారపురెడ్డి పెద్దిరాజు, మాముడూరు

  అప్పారావు : ఉపాధి పథకంలో పశుగ్రాసం పెంచుకోవచ్చు. అర ఎకరం స్థలం ఉంటే రూ.32 వేల 900 అందిస్తారు. జాబ్‌కార్డు ఉండాలి. పశుసంవర్థక శాఖ ద్వారా ప్రతిపాదనలు రావాలి.

- **ఉపాధి హామీ కార్డులో పేరు మార్పుకు అవకాశం ఉందా ?**

  - దాసాం తాతాజీ, బల్లిపాడు

  అప్పారావు : ఉంది. స్థానిక ఏపీవోతో మాట్లాడితే ఎలా చేయాలో చెబుతారు. మా కార్యాలయం నుంచి సంబంధిత అధికారికి ఆదేశాలు ఇస్తాం. ఈ ప్రక్రియ పూర్తి చేస్తే తొందరలో కొత్త కార్డు జారీ చేస్తాం.

- **కూరగాయల సాగుకు ఏమైన రుణ సదుపాయం ఉందా ?**

  - ఎస్.వెంకటేశ్వరరావు, ఆచంట

  అప్పారావు : కూరగాయల పెంపకానికి నేరుగా అవకాశం లేదు. హార్టికల్చర్ పథకంలో మామిడి, కొబరి, నాటు జామ, నిమ్మ, కోకో వంటి పంటలు వేసుకునేందుకు ఉపాధి హామీ పథకంలో ఇస్తారు. నిబంధనల ప్రకారం హార్టికల్చర్ శాఖ ద్వారా ప్రతిపాదనలు రావాలి. ఇందులో అంతర్ పంటలుగా కూరగాయల సాగుకు ఎకరానికి వెయ్యి రూపాయిలు ఇస్తారు.

- **మినీ గోకులం పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందా?**

  - ఎం.సీతారామ్ (మల్లిపూడి)

  అప్పారావు : దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. పశువులను బట్టి నిధులు కేటాయింపు ఉంటుంది. పశుసంవర్ధకశాఖ ద్వారా దరఖాస్తులు రావలసి ఉంది. అర్హత ఉంటే మంజూరు చేస్తాం.

- **ఫౌల్ట్రీఫారమ్ పెట్టుకునేందుకు అవకాశం ఉందా?**

  - జక్కంశెట్టి ప్రసాద్ : పొలమూరు

  అప్పారావు : అవకాశం ఉంది. 100 బర్డ్సుకు 87వేలు ఇస్తాం. 26వేల 100 లబ్ధిదారుడు భరించాలి.అరఎకరం స్థలం కావాలి.200 బర్డ్సుకు 1,32వేలు ఇస్తాం. 39వేల 600 లబ్ధిదారుడు భరించాలి8 సెంట స్థలం అవసరం ఉంటుంది.

- **ఉపాధి హామీ పథకంలో చేరాలంటే అర్హతలు ఏమిటి?**

  - కె.శ్రీనివాస్, కాళ్ళ

  అప్పారావు : 18 ఏళ్ల నిండి, గ్రామంలో ఉంటూ, మట్టి పని చేయడానికి అంగీకరిస్తే అటువంటి వారు అర్హులు. ఎవరికైనా ఇస్తారు. కార్డు పొందిన వారికి తప్పని సరిగా 100 రోజుల పని కల్పిస్తాం. పనిని బట్టి రోజుకు రూ.307 చెల్లిస్తాం.

- **ఎరువుల గుంతల పథకంలో లబ్ధిని వివరించండి ?**

(మిగతా 6వ పేజీలో)

- **జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డులు ఎన్ని ఉన్నాయి ?**

  అప్పారావు : జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా లక్షా 87 వేల జాబ్ కార్డులు ఇచ్చాం. ఇందులో లక్షా 37 వేల కార్డుదారులు ఉపయోగించుకుంటున్నారు. 30 లక్షల రోజులు పనిదినాలు కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 22 లక్షల 71 వేల 157 రోజులు పనిదినాలు కల్పించాం. ఆరు కోట్ల 48 లక్షలు విడుదల కాగా ఇప్పటి వరకు రూ.6.44 కోట్లు అందించాం. మిగిలిన మొత్తం తర్వలోనే విడుదల అవుతుంది.

- **ఉపాధి హామీలో ఎన్ని సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు ?**

  అప్పారావు : జిల్లాలో ఎన్‌ఆర్‌జీఎస్‌లో 460 సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదించి రూ.52 కోట్ల 18 లక్షలు కేటాయించాం. ఇప్పటికే 420 రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మొత్తం 71.59 కిలోమీటర్లకు 66.59 కిలోమీటర్ల రోడ్లను పూర్తి చేశాం. మిగిలిన పనులు జరుగుతున్నాయి.

- **ఉపాధి హామీలో పండ్ల తోటలను పెంచుకోవచ్చా ?**

  అప్పారావు : సన్న, చిన్న కారు రైతులకు ఐదెకరాల లోపు ఉంటే ఉపాధి హామీలో ఉచిత పండ్ల తోటల పెంచుకోవచ్చు. మామిడి, జీడిమామిడి, నిమ్మ, బత్తాయి, నాటు జామ, కొబ్బరి, ఆయిల్ పాం, తైవాన్ జామ, గులాబి, మల్లి, మోరింగ్, మునగ, డ్రాగన్ ఫ్రూట్స్, కోకో వంటి తోటల పెంపకానికి మూడేళ్లపాటు ఆర్థిక సాయం ఉంటుంది.

బడి గంట మోగింది

ఉత్సాహంగా పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు



వేసవి సెలవుల అనంతరం ఏలూరులో పాఠశాలలకు పరుగెత్తుతున్న విద్యార్థులు



ఏలూరు ఈదర సుబ్బమ్మ పాఠశాలలో ఉదయం అసెంబ్లీలో విద్యార్థుల ప్రార్థన











వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం తిరిగి తెరుచుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. మంచి రోజు కూడా కలిసి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 50 శాతం పైగా విద్యార్థులు తొలిరోజు తరగతులకు హాజరయ్యారు. సైకిల్, ఆటో, బస్సులలో విద్యార్థులు పాఠశాలలకు చేరుకున్నారు. సెలవుల అనంతరం కలుసుకున్న స్నేహితులు ముచ్చట్లలో మునిగిపోయారు. అంగన్‌వాడీల్లో గురువారం ప్రవేశాలు ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఇవ్వడంతో పాటు విద్యా సామగ్రి, పుస్తకాలు అందజేశారు. - ఫొటోగ్రాఫర్ / ఏలూరు



మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న చందు

చందుకు ఉత్తమ రైతు పురస్కారం

మొగల్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం గ్రామానికి చెందిన అయితం రాన్ చందు మంత్రి అచ్చంనాయుడు నుంచి ఉత్తమ రైతు అవార్డును గురువారం అందుకున్నారు. సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించడంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి డాక్టర్ ఎంవీ.రెడ్డి ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 61వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కృష్ణ ఆడిటోరియంలో అవార్డుతో పాటు రూ.25వేలు నగదు, జ్ఞాపిక, ధ్రువపత్రం అందుకున్నారు. పలువురు ప్రజా ప్రజాప్రతినిధులు, రైతులు చందును అభినందించారు.

అగ్రిగోల్డ్ డిపాజిట్ల సొమ్ము ఇప్పించండి

భీమవరం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు బలైపోయిన లక్షలాది మంది కస్టమర్లు, ఏజెంట్లకు సొమ్ములు ఇప్పించాలని, బాధితుల కేసులను వాదించడానికి ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. తణుకులో ఈనెల 15న నిర్వహించే సమావేశం నిర్వస్తున్నట్లు గురువారం ఆయన తెలిపారు. అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం కోట్ల రూపాయలు సేకరించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనాల భీమారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా కంటి తుడుపుగా రూ.10 వేలు, రూ.20 వేలు పరిహారం చెల్లించారని, ఇంకా లక్షల్లో బాధితులున్నారని గుర్తుచేశారు. ఎం.సీతారాంప్రసాద్, కె.గోపాలకృష్ణ, చెల్లబోయిన రంగారావు, ఎన్.పల్లయ్య, ఏవీ రాంబాబు, పి.నరసింహాచారి, జె.వెంకటేశ్వరరావు, ఎం.సాయిబాబు, వై.వీరకృష్ణ పాల్గొన్నారు.

వైద్య సేవలందించే గౌరవ డాక్టర్

అలంపురం ట్రస్టు ఆసుపత్రి చైర్మన్ కృష్ణంరాజుకు డాక్టరేట్



పెంటపాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆయన సాధారణ రైతు. ప్రతి నిత్యం వేల మంది పేదలకు వైద్య సేవలందిస్తారు. అలంపురంలో వెంకట రమణ సేవా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి వివిధ ప్రాంతాల నుంచి వైద్య నిపుణులను తీసుకువచ్చి పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. ఆయనే కొలనువాడ పెదకృష్ణంరాజు. ఆయన సేవలను గుర్తించిన న్యూఢిల్లీలోని సోక్రటీస్ సోసల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. 2015లో పేదల కోసం ట్రస్టు ఆసుపత్రిని ఏర్పాటుచేసి అప్పటి నుండి నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తూనే ఉన్నారు. ప్రతీ వారం ప్రత్యేక వైద్యులతో ఖరీదైన వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందజేస్తున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో 51 వేల మంది రోగులు ఈ ఆసుపత్రిలో శాశ్వత ఓపీ నమోదు చేసుకున్నారు. వారికి ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా ట్రస్ట్ ఆసుపత్రికి వెళతారు. అద్దెభవనంలో ప్రారంభమైన వైద్య సేవలు ప్రస్తుతం అలంపురంలో రెండు నూతన భవనాలలో కొనసాగుతున్నాయి. నాలుగున్నర ఎకరాలలో ఆసుపత్రి, వృద్ధాశ్రమం, వేంకటేశ్వరస్వామి ఆలయం, సత్రం ఏర్పాటు చేయడానికి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నెల 21న ఢిల్లీలో పెద కృష్ణంరాజుకు డాక్టరేట్ అందుకోనున్నారు. చైర్మన్ పెదకృష్ణంరాజు మాట్లాడుతూ డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో తమ ట్రస్టు ద్వారా పేదలకు మరిన్ని సేవలు అందిస్తామని, ఆ దిశగా ఏర్పాట్లు చేశామన్నారు



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ఏలూరుసిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా జడ్పీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట



- డివిజన్ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలోకి
- ఏర్పాట్లపై కలెక్టర్, జడ్పీ సీఈవోలకు ఆదేశాలు

ఏలూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌లో సంస్కరణల పర్వం కొనసాగుతోంది. అన్ని కార్యాలయాలకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి, ఉపాధి హామీ పథకం ఏపీడీ, డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు (డీడీఎల్‌వో)లు ఒకేచోట ఏర్పాటు కానున్నాయి. జూన్ 12లోగా ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గతంలో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తాజాగా మూడు కార్యాలయాలు ఒకేచోట ఉండేలా కలెక్టర్ల పర్యవేక్షణలో జడ్పీ సీఈవోలు నిర్మాణ పనులు, ఇతర ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరు డివిజన్‌కు సంబంధించి అమీనాపేట మీసేవ సెంటర్ ప్రాంగణం, జంగారెడ్డిగూడెం డివిజన్‌కు అశ్వారావుపేట రోడ్డులోని పాత ఎస్టీ హాస్టల్ ప్రాంగణం, నూజివీడు డివిజన్‌కు ఎస్ఆర్ఆర్ బాలుర జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఈ మూడు కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం డివిజన్‌కు భీమవరం కలెక్టరేట్ సమీపంలోని మారుతీనగర్ వద్ద, తాడేపల్లిగూడెం ఎంపీడీవో కార్యాలయం, నరసాపురం డివిజన్‌కు 24వ వార్డు కప్పాలపేట వద్ద డీఎల్‌డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేయనున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యం

- గర్భిణికి కాల పరిమితి ముగిసిన ట్యాబ్లెట్స్
- ఏలూరు జిల్లా ఆస్పత్రిలో నిర్వాకం

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. వైద్యవిధాన పరిషత్‌లో ఉన్నప్పుడు ఉత్తమ సేవలతో జాతీయ స్థాయిలో రెండు పర్యాయాలు అవార్డులు అందుకుంది. మెడికల్ కాలేజీ టీచింగ్ ఆసుపత్రిగా మారిన తరువాత సేవలు అథమ స్థాయికి చేరుకున్నాయని విమర్శలు వస్తున్నాయి. వైద్యసేవలు ఎలా ఉన్నా మందులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక గర్భిణికి గడువు ముగిసిన మందులను ఇవ్వడంతో అవాక్కైంది. బిడ్డ, తల్లి ప్రాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామానికి చెందిన భవాని మూడు నెలల గర్భిణి. కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రి తల్లి బిడ్డల విభాగంలో వైద్య సేవల కోసం తీసుకువచ్చారు. ఈనెల 10న జనరల్ చెకప్ చేసి వివిధ ల్యాబ్ పరీక్షలను కూడా చేశారు. ఆ పరీక్షలను ఈనెల 11న తీసుకుని తిరిగి వైద్యుల వద్దకు వెళ్లగా ఆమెకు మందులు రాయడంతో అదే భవనంలో ఉన్న ఫార్మసీ కౌంటర్‌లో ఉదయం మందులు తీసుకున్నారు. మొత్తం నాలుగు రకాల మందులు రాయగా వాటిలో డాక్సిలామైన్ సక్సినేట్ (నిద్రపట్టడానికి వాడేవి) టాబ్లెట్స్‌పై కాలపరిమితి 2025 మే వరకూ మాత్రమే ఉంది. వాటిని గర్భిణికి పంపిణీ చేశారు. భవానీ కుటుంబ సభ్యులు ఆమెకు టాబ్లెట్స్ వేసే ముందు గడువు తేదీ చూసి కంగారుపడ్డారు. చూడకుండా వేసుకుంటే తల్లి బిడ్డ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. తమతో పాటు ఈ మాత్రలు ఎంత మందికి ఇచ్చారో.. వాళ్ల పరిస్థితి ఏమవుతుందో ఏమిటోనంటూ ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని మీడియా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శశిధర్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని శుక్రవారం ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సాధారణంగా ఎక్స్‌పైరీ అయిన టాబ్లెట్స్‌ను ముందుగానే తీసి వేస్తారని కాని డిస్పెన్సరీకి ఎవరు ఇచ్చారు. అక్కడ నుంచి పంపిణీ ఎలా జరిగాయి అనే దానిపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.



గడువుతీరిన డాక్సిలామైన్ సక్సినేట్ టాబ్లెట్స్

లారీ బోల్తా : డ్రైవర్ మృతి



పాలవాగు వద్ద బోల్తా కొట్టిన లారీ

కుక్కునూరు, జూన్12 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు భద్రాచలం ప్రధాన రహదారిలో పాలవాగు వద్ద జరిగిన ప్రమాదంలో లారీ బోల్తా పడడంతో డ్రైవర్ చరణ్‌ప్రీత్ సింగ్ (50) మృతి చెందాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు చెన్నై నుంచి రాయ్‌పూర్‌కు డోజర్‌తో క్యాట్ వెహికల్ వెళుతుండగా పాలవాగు వద్ద అదుపు తప్పిన లారీ బోల్తాపడింది. డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానికుల సాయంతో డ్రైవర్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు రాయ్‌పూర్‌కు చెందినవాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొవ్వలి అడ్డరోడ్డు సమీపంలో..

దెందులూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కొవ్వలి అడ్డరోడ్డు సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెదవేగి సీఐ రాజశేఖర్, దెందులూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

కారు.. లారీ ఢీకొని..

పాలకొల్లు టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కుంపట్ల రామ్‌గోపాల్ (41) గురువారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. రామ్‌గోపాల్ కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లి పాలకొల్లు తిరిగి వస్తున్నారు. కృష్ణా జిల్లా కృత్తివెన్నులో కారు-లారీ ఢీకొనడంతో రామ్‌గోపాల్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆయన భార్య కుమారిని భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన కుమారుడు, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. మంచివాడుగా పేరొందిన రామ్‌గోపాల్ మృతితో పట్టణంలో విషాద చాయలు అలముకున్నాయి.

మోటారు సైకిళ్లు ఢీకొని..

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో గాయపడిన వ్యక్తిని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. నూజివీడు మండలం వెస్ట్ దిగవల్లి గ్రామానికి చెందిన కావూరి కోటయ్య (52) మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఏలూరు-చింతలపూడి మార్గంలో వలసపల్లి అడ్డరోడ్డు వద్ద ఎదురుగా మోటారు సైకిల్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కోటయ్యను ధర్మాజీగూడెం పీహెచ్‌సీకి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యులు పరీక్షించి అప్పటికే కోటయ్య మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గోదావరిలో మత్స్యకారుడి మృతి

నరసాపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గోదావరిలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు ఎస్ రాంబాబు(45) గురువారం మృతి చెందాడు. తెల్లవారుజామున వేటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. మత్స్యకారులు గోదావరిలో గాలించగా బోట్లు నిలిచే ప్రదేశంలో మృతదేహం వల చుట్టుకుని కనిపించింది. మత్స్యకారులు తాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రభుత్వ విప్ నాయకర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెట్టు కొమ్మ విరిగిపడి..

నరసాపురం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన ఎ.సర్వేశ్వరరావు(54) చెట్టు కొమ్మ విరిగిపడడంతో గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈనెల 9న అల్లు సర్వేశ్వరరావు, మరో ఇద్దరు తన ఇంటి సమీపంలో మామిడికాయాల కోస్తుండంగా చెట్టు కొమ్మ విరిగి కిందికి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన సర్వేశ్వరరావును భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. దీనిపై ఆయన కుమారుడు రాహుల్‌సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ చెప్పారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జరిగిన గొడవతో మనస్తాపం చెందిన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన ప్రగడ నాగేంద్ర (24) తనతో పని చేసే రాము, శ్రీపద్రు సాయికి ఈ నెల 10న రాత్రి మద్యం ఇప్పించాడు. ఆ సమయంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో రాము అక్కడ ఉన్న వస్తువుతో నాగేంద్ర తలపై కొట్టడంతో తలకు చిన్న దెబ్బతగిలింది. బుధవారం రాత్రి ఏలూరు టూటౌన్ పోలీసులు నాగేంద్ర ఇంటికి వచ్చి రౌతు రాము కేసు పెట్టాడని ఉదయాన్నే స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లారు. తాను ఇప్పించిన మద్యం తాగి తనపైనే కేసు పెట్టారని మనస్తాపానికి గురైన నాగేంద్ర ఇంట్లో చున్నీతో ఉరి వేసుకున్నాడు. గమనించిన తల్లి ఇరుగు పొరుగు సహకారంతో కింది దించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



విద్యుత్ స్తంభంపై మృతదేహం (ఇన్‌సెట్) మదిరి నవీన్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న యువకుడు విద్యుదాఘాతంతో స్తంభంపైనే మృతి చెందాడు. నెల్లూరు జిల్లా భీమవరప్పాడుకు చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ కొమ్మి మన్మథ శేఖర్ వద్ద కృష్ణాజిల్లా చంద్రాల గ్రామానికి చెందిన మదిరి నవీన్ (26) పని చేస్తున్నాడు. మైసన్నగూడెంలో పలు విద్యుత్ లైన్ల పనులు చేస్తున్నారు. గురువారం నవీన్‌తో పాటు మరో ఇద్దరు పనులు పూర్తి చేసుకుని తిరిగి వెళుతున్నారు. అదే సమయంలో మైసన్నగూడెం లైన్‌మన్ యాదాల సురేష్ వచ్చి స్తంభంపై చిన్న పని ఉందని నవీన్‌ను తీసుకువెళ్లగా మిగిలిన ఇద్దరు జంగారెడ్డిగూడెం వెళ్లిపోయారు. 11 కేవీ హెచ్‌టి విద్యుత్ స్తంభంపై నవీన్ పని చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతంతో స్తంభం పైనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏడీఈ సుబ్బారావు, ఎస్సై ఎస్‌కే.జబీర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏడీఈ సుబ్బారావు మాట్లాడుతూ మరమ్మతుల నిమిత్తం ఎల్‌సి తీసుకున్నారని, దగ్గరలో ఇళ్లకు వెళ్లిన సరఫరా రిటన్‌తో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనాలో నిర్ధారణకు వచ్చామన్నారు.

భవన నిర్మాణ పనుల్లో ఉండగా..

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కొత్తూరులో భవన నిర్మాణ పనిలో విద్యుత్ వైరు తగిలి యువకుడు మృతి చెందాడు. దార్లంక మునేశ్వరరావు (నాని) (35) గురువారం తాపీ పనిచేస్తుండగా విద్యుత్ వైరు కాలికి తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నాని అవివాహితుడు. తండ్రి విష్ణు దుబాయ్ వెళ్లగా తల్లితో నవాబుపాలెంలో ఉంటున్నాడు. తల్లి ఫిర్యాదుతో ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు.

రైలు పట్టాలపై యువకుడు ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

భీమవరం క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గునుపూడికి చెందిన అంజి (22) క్షణికావేశంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేయబోయాడు. వన్‌టౌన్ సీఐ నాగరాజుకు ఫోన్ కాల్ ద్వారా సమాచారం అందడంతో తక్షణమే స్పందించి హెడ్ కానిస్టేబుల్ శేషావతారం, కానిస్టేబుల్ జయరాజును సంఘటనా స్థలానికి పంపించారు. కొద్ది నిముషాల్లోనే వారు రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న కీలక సమయంలో అతడిని అదుపులోకి తీసుకుని కాపాడారు. అనంతరం యువకుడికి అవసరమైన మానసిక మద్దతును అందించి బంధువులకు అప్పగించారు. త్వరితగతిన స్పందించిన వన్‌టౌన్ పోలీసు అధికారులు, సిబ్బందికి సదరు యువకుడి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హత్యాయత్నం కేసుల్లో.. ఆరుగురి అరెస్టు

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం సరిహద్దు విషయమై రెండు వర్గాలు గొడవ పడ్డారు. నడిరోడ్డుపై కత్తులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటపై ఏలూరు త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి రెండు కేసుల్లో ఆరుగురిని గురువారం అరెస్టు చేశారు. ఫిరంగుల దిబ్బ ప్రాంతానికి చెందిన కగ్గా వెంకటేశ్వరరావు, ఇబ్బా వెంకటేశ్వరరావుకు ఇంటి సరిహద్దు గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 10న రెండు వర్గాలు ఇంటి వద్ద ఘర్షణ పడి అనంతరం ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసర్ ఎదురుగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనపై రెండు వైపుల ఫిర్యాదులపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. కగ్గా వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో ఇబ్బా నాగరాజు, వరప్రసాద్‌ను అరెస్టు చేశారు. దారం దావీదు రాజు ఫిర్యాదుతో యడవల్లి బాలాజీ, కర్నాటి వెంకట త్రినాథ్, నక్కా వెంకట రమణ, యడవల్లి నాగలక్ష్మిని అరెస్టుచేసి ఏలూరులోని కోర్టుకు హాజరిచారు. కోర్టు వారికి పర్యగా 14 రోజులు రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

అదనపు కట్నం వేధింపులు

ఆచంట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన వీరమల్లు లక్ష్మీదుర్గను భర్త, అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, గాయపరిచాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదుర్గ తండ్రి పంది లక్ష్మీనారాయణ గురువారం ఆచంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీదుర్గ పుట్టుకతో చెవిటి, మూగ. 2014లో వీరమల్లు నాగరాజుతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.1.5 లక్షల కట్నం, బంగారు వస్తువులు, సారె ముట్టజెప్పారు. నాగరాజు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. భార్యను అదనంగా రూ.2 లక్షలు తీసుకు రావాలని వేధిస్తున్నాడు. భర్తతోపాటు కుటుంబ సభ్యులు వీరమల్లు మసేనమ్మ, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ మే నెల 20న లక్ష్మీదుర్గను కొట్టి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్త, అత్త వేధింపులు..

భీమవరం క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తన భర్త, అత్త, చిన్నత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన కాకుమాను కృష్ణమణి టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కృష్ణమణికి విజయవాడకు చెందిన ప్రేమ్‌కుమార్‌తో 2024లో వివాహమైంది. కొంత కాలం బాగానే చూసుకున్నాడు. అనంతరం వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను సరిగ్గా చూడడం లేదని వాపోయింది. అదనంగా రూ. 5 లక్షలు కట్నం తెమ్మని వేధించడంతో ఆమె పుట్టింటికి చేరుకుంది. గురువారం భర్త ప్రేమ్‌కుమార్, అత్త, అత్త చెల్లెలిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.

ఉక్కు కార్మికులకు ఏఐటీయూసీ అండ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి):విశాఖ ఉక్కు కర్మాగార కార్మికులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు డిసోమసుందర్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కార్మికుల పోరాటానికి మద్దతుగా దేశ వ్యాప్త సంఘీభావ దినం పాటించాలన్న ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ పిలుపు మేరకు గురువారం తాడేపల్లిగూడెంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి ఏరియా కమిటి అధ్యక్షులు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీష్, కార్యనిర్వాహక కార్యదర్శి కలింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

నరసాపురం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంతో పాటు రాయపేట, చలవపేట, శ్రీహరిపేటలోని వసతిగృహాల్లో గురువారం దోమల నివారణపై స్పెషల్ క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసాపురం మలేరియా సబ్ యూనిట్ ఇన్‌చార్జి అధికారి బాలచంద్రుడు దోమల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రాంగణంలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి రోజు దోమల నివారణకు ఎంఎన్ ఆయిల్ పిచికారి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

విశ్వేశ్వర ఆలయ భూముల కౌలు వేలం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కొండ్రుప్రోలు విశ్వేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు వేలం గురువారం ఇన్‌చార్జ్ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 12.26 ఎకరాల భూమి వేలం నిర్వహించారు. గతంలో ఈ భూములు రూ.3.79 లక్షలకు వెళ్లగా గురవారం జరిగిన వేలంలో 6.08 లక్షలకు వెళ్లాయి.

అమ్మవారిని దర్శించుకున్న ఆరిమిల్లి



తణుకు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సజ్జాపురం ఏవుళ్ళమ్మ ఆలయం వద్ద ఉన్న అఖిల భారత భవాని దీక్షా పీఠంలో అమ్మవారిని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకున్నారు. పీఠం 20వ వార్షికోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పీఠం వ్యవ స్థాపకులు శివరామ కృష్ణ స్వామీ జీ, కృష్ణవేణి మాతాజీ ఆధ్వర్యంలో జరుగుతున్న పూజ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. ఆరిమిల్లిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గురు భవాని దివాకర్, అమ్మ భక్తుడు హరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

బొండాడలో మురుగు డ్రెయిన్ నిర్మాణ పనులు



మురుగు డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ నాగరాజు

కాళ్ళ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బొండాడ గ్రామంలో మురుగునీరు పంట కాలువలో కలవకుండా నేరుగా బొండాడ మురుగు డ్రెయిన్ లోకి తరలివెళ్ళేలా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ మురుగు డ్రెయిన్ నిర్మాణ పనులను బుధవారం బొండాడ సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు పరిశీలించారు. రానున్న వారం రోజుల్లోపు పనులు పూర్తి చేసి గ్రామంలో ఎక్కడా మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీ నాయకులు మన్నె సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్పీ జయసూర్య తదితరులు

భీమవరం క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మానవాళికి యోగా చాలా ముఖ్యమని, యోగా చేయడం వల్ల శరీరంలో అన్ని అవయవాలు సక్రమంగా పని చేస్తాయని, మానసిక ప్రశాంతత కలిగి ఉంటారని డీఎస్పీ జయసూర్య అన్నారు. భీమవరం డీఎస్పీ కార్యాలయం వద్ద గురువారం యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 21న వాడవాడలా యోగ చేయడం ద్వారా యోగాంధ్రకు సార్థకత ఉంటుందన్నారు.

నీటి ఎద్దడిరానివ్వొద్దు



మంచినీటి చెరువును పరిశీలించి సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్

నరసాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మంచినీటి చెరువులో నీరు అడుగండటంతో నీటి ముప్పు పొంచి ఉందని 'ఆంధ్రజ్యోతి'తో ప్రచురితమైన వార్తకు కమిషనర్ అంజయ్య స్పందించారు. గురువారం డీఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈలతో కలిసి చెరువును పరిశీలించారు. ట్యాంక్‌లో ఉన్న నీటి మట్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. మరో రెండు మూడు రోజుల్లో కాల్వలకు నీరు వచ్చే అవకాశం ఉన్నందున అప్పటి వరకు నీటిని పొదుపుగా వాడాలని ఆదేశించారు. అనంతరం వాటర్‌వర్క్సను సందర్శించారు. ఆయన వెంట ఏఈ కిషోర్, సిబ్బంది ఉన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ విడనాడాలి

భీమవరం అర్బన్, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని, తొలగించిన వేలాది మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, వేతన బకాయిలు చెల్లించాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ నాయకులు ఆందోళన నిర్వహించి డిఆర్‌వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు.

విమాన ప్రమాదంపై కేంద్ర మంత్రి దిగ్భ్రాంతి

భీమవరం టౌన్/తణుకు, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ విమానాశ్రయం సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా ప్రమాదంపై కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల ఆత్మ శాంతి కలగాలన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. విమాన ప్రమాదం తనను ఆందోళనకు గురిచేసిందని, మహా విషాద సంఘటన అని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. విమానం కూలిన ఘటన తీవ్రంగా కలిచివేసిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకులో ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు.

ఆహా.. ఏమి రుచి

(3వ పేజీ తరువాయి)



- బియ్యం సరియైనవి కాకపోతే అన్నం బాగోదు. అన్నం తినేలా లేకపోతే సరిగా భోజనం చేయలేం. సన్నబియ్యం అన్నం పెట్టడం నాకు చాలా ఆనందంగా ఉంది.

  \- వై.లాస్య, భీమవరం



- సన్నబియ్యం అన్నంతో రుచికరమైన భోజనం అందిస్తున్నారు. గతంలో బియ్యం ముద్దగా ఉండేది. అరుగుదల ఇబ్బంది ఉండేది. ఇప్పుడు అలా లేదు. మెనూలో పోషకాలు కలిగిన కూరలు ఉన్నాయి.

  \- కె.పార్వతి, భీమవరం



- పాఠశాలకు దూరప్రాంతం నుంచి వస్తాను. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటాను. భోజనం చాలా బాగుంటుంది. సన్నబియ్యం అన్నం మంచి కూరలతో పెడుతున్నారు. చాలా ఆనందంగా ఉంది.

  \- పి.లోకేశ్వరి, భీమవరం

ఉపాధి హామీతో అందరికి సాయం

(3వ పేజీ తరువాయి)

అప్పారావు : ప్రభుత్వం రైతులను ప్రోత్సహించేందుకు కొత్తగా 'ఎరువుల గుంతలు' పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతీ రైతు వారికి ఉన్న పశువుల పేడ, ఇతర చెత్తను గుంతలో వేసి తద్వారా వచ్చిన ఎరువును చేలల్లో వేసుకునేలా ఈ పథకం చేర్పాటు చేశారు. నాలుగు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పుతో గుంతను తయారు చేసుకుంటే రూ.850, ఎనిమిది మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పుతో గుంతను ఏర్పాటు చేసుకుని ఎరువు తయారుచేసుకునేందుకు రూ.1630 అందిస్తారు. రైతుకు తప్పనిసరిగా ఉపాధి కార్డు ఉండాలి.

- **జిల్లాలో మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి ?**

అప్పారావు : జిల్లాలో 780 మినీ గోకులాల నిర్మాణాలకు రూ.15 కోట్ల 75 లక్షలు మంజూరు చేశాం. ఇప్పటికి 509 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.









తాడేపల్లిగూడెంలో బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి.. ఇరగవరం, మొగల్తూరులలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు ఆరిమిల్లి, నాయకర్... తూర్పుపాలెంలో తరగతి గదులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని

కోలాహలంగా పాఠశాలలు పునఃప్రారంభం

విద్యా కిట్లు అందజేత
సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం
పాల్గొన్న కూటమి నాయకులు

పాలకొల్లు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు పూర్తయ్యి గురువారం పాఠశాలలు తెరచుకున్నాయి. పలు పాఠశాలల్లో విద్యాకానుక కిట్లను ఆయా వార్డుల నాయకులు, హెచ్‌ఎంలు అందజేశారు. విద్యా కిట్లలో బ్యాగ్, బూట్లు, సాక్స్, టై, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్‌తో పాటుగా మూడు జతల యూనిఫాం క్లాత్‌ను అందజేశారు. పట్టణంలో 22 మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలు, 7 హైస్కూల్స్ ఉన్నాయి. మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యం ఇవ్వడంతో విద్యార్థులు సంతృప్తిగా భోజనాలు చేశారు. పలు పాఠశాలల్లో మెనూ ప్రకారం వెజిటబుల్ రైస్, పలావ్, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, రాగి జావ అందజేశారు.

ఆకివీడు: ఎంఈవో రవీంద్ర సమక్షంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు పుస్తకాలు,బ్యాగులు, సన్న బియ్యంతో భోజనం అందించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మోటుపల్లి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, కూటమి నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొగల్తూరు: పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నాణ్యమైన సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని మధ్యాహ్న భోజనం పథకంలో ఎమ్మెల్యే నాయకర్ విద్యార్థులకు వడ్డించారు. వారితో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు బొల్లా చంటి, పాలా రాంబాబు, జనసేన నాయకులు నిప్పులేటి తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ప్రారంభించారు. భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో జడ్‌పీటీసీ సోమేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, బీజేపీ మండలాధ్యక్షుడు పానకాల కృష్ణాంజనేయరావు, విద్యా కమిటీ ఛైర్మన్ నాగరాజు, తహసీల్దార్ సుందర్ సింగ్, ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మలాదేవి పాల్గొన్నారు.

పోడూరు: ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థినీ తీర్చిదిద్దాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలం తూర్పుపాలెం యూపీ స్కూల్‌లో 9, 10 తరగతులను పెంచి జడ్పీహైస్కూల్‌గా మార్పుచేశారు. దీంతో గురువారం 9,10 తరగతులను ఎమ్మెల్యే పితాని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ గుబ్బల ఉషారాణి, మాజీ జడ్పీటీసీ బొక్కా నాగేశ్వరరావు, ఎంపీడీవో బి.మంగాకుమారి, ఎంఈవో జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రభుత్వ పాఠశాలలు దీటుగా ప్రవేటు పాఠశాలలు ఉండాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన మరియు కార్మిక సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జి అన్నారు. గురువారం యాగర్లపల్లిలో ప్రభుత్వం నుంచి వచ్చిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.

ఇరగవరం: ఇకపై మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం అందించి ప్రతిరోజు ఒక ప్రత్యేకమైన మెనూ ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ప్రారంభించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. భవిత కేంద్రాన్ని సందర్శించి అక్కడ చదువుతున్న విద్యార్థినికి వీల్‌చైర్, రో లెటర్స్ అందించారు.

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణ, మండలంలో గురువారం 124 ప్రభుత్వ స్కూళ్లు పునః ప్రారంభయ్యాయి. వచ్చిన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పంపిణీ చేశారు. పండుగ వాతావరణంలో స్కూల్ భవనాలకు మామిడితోరణాలు కట్టి విద్యార్థులకు ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు స్వాగతం పలికారు. మండలంలోని వైఎస్ పాలెం స్కూల్‌ను సర్పంచ్ వైఎస్ నాగముత్యామాంబ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ వైఎస్ బాబులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఎంఈవో పుష్పరాజ్యం పలు స్కూళ్ళను సందర్శించారు. తరగతి గదులు పరిశుభ్రత, పారిశుధ్యం , మధ్యాహ్న భోజన పథకం తీరును తనిఖీ చేశారు.

పాలకోడేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు దూసుకుపోతుంటే ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఉండి నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నారని డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కునాథరాజు మురళీకృష్ణంరాజు అన్నారు. పాలకోడేరులో డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో పైవిధంగా మాట్లాడారు.

పాలకొల్లు రూరల్: పూలపల్లి గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పాలకొల్లు ఏఎంసీ చైర్మెన్ కోడి విజయభాస్కర్ గురువారం కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సీఆర్ రాజు, నెక్కంటి ఆదినారాయణ, పాముల రజనీకుమార్ పాల్గొన్నారు.





భీమవరంలో కేక్ కట్ చేస్తున్న సీతారామలక్ష్మి, పార్టీ నాయకులు.. ఆకివీడులో దాత వెంకట సత్య నారాయణ రాజును సన్మానించిన నాయకులు

కూటమి ఏడాది సంబరాలు

ఏడాది పరిపాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం
కేక్‌లు కట్ చేసిన నాయకులు

భీమవరం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):భీమవరం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసి ఏడాదికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనకు వ్యతిరేకంగా ప్రజల ఆశీర్వాదంతో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టి సుపరిపాలన ఏడాది పూర్తయిందని అన్నారు. త్వరలోనే సూపర్ సిక్స్ హామీలన్ని అమలు చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కొయ్యలగడ్డ గణపతి, కోళ్ళ సీతారాం మాట్లాడారు.

తణుకు: వైసీపీ ఐదేళ్ళ పాలనలో వ్యవస్థలన్నీ జగన్ నాశనం చేశాడని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ఏడాదిలో సుపరిపాలన అందించిందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తుందని వివరించారు. జగన్ కేవలం అధికారాన్ని అడ్డంపెట్టుకుని దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాళ్ళ: కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కాళ్ళ మండలంలో గురువారం కూటమి శ్రేణులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, డీసీ ఛైర్మన్ తోట ఫణిబాబు, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు, యేరుబండి రామాంజనేయులు, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, అభిమానుల సమక్షంలో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొల్లా చంటి, కలిదిండి కుమార్ బాబు, పాలా రాంబాబు, కత్తిమండ ముత్యాలరావు, బోగ రాజు, కొల్లాటి బాలకృష్ణ, డొల్లా రత్నంరాజు, బళ్ళ శ్రీను, కుక్కల రవి, మోకా ఏడుకొండలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత సమర్థవంతమైనపరిపాలన అందిస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబును నాయకులు సత్కరించారు.

ఆకివీడు: కొత్త ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఏడాది పాటు పేద ప్రజలకు అన్న క్యాంటీన్ ద్వారా రోజుకు సుమారు 300 మందికి ఉచితంగా భోజనం అందించిన టీడీపీ సీనియర్ నేత, దాత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజును గురువారం టీడీపీ శ్రేణులు సన్మానించాయి. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, జాకీర్, అజ్మల్, దారపురెడ్డి కన్నబాబు, బాబీ, రామరాజు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

కనీస వేతనం కోసం మునిసిపల్ కార్మికుల ధర్నా

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయం వద్ద గురువారం మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మికులు ధర్నా నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22 నుంచి సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కమిషనర్ ఏసుబాబుకు వినతిపత్రం అందించారు.

పాలకొల్లు అర్బన్: మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గురువారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, టెక్నికల్ వారికి రూ29.200, నాన్ టెక్నికల్ జీతాలు రూ.24.500 ఇవ్వాలని, 10ఏళ్ళ సర్వీస్ పూర్తి చేసిన వారిని రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62కి పెంచాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

నరసాపురం టౌన్: నరసాపురంలో మునిసిపల్ కార్మికులు ఆందోళనకు దిగారు. నల్లబ్యాడ్జీలు ధరించి పురపాలక సంఘ కార్యాలయం బయట పనికి తగ్గ వేతనం, దీర్ఘకాలంగా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

పాలకొల్లు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లోవోల్టేజి సమస్య పరిష్కరించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పాలకొల్లు ఏఎంసీ చైర్మెన్ కోడి విజయభాస్కర్ అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను గురువారం ఏఎంసీ చైర్మెన్ కోడి విజయభాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ లంక శ్రీనివాసరావు, ఎల్‌ఐ ఎన్.వెంకట్రావు, నాయకులు పాముల రజనీకుమార్, అందే కోటివీరభద్రం, నెక్కంటి ఆదినారాయణ, శ్రీహరిరాజు పాల్గొన్నారు.

టీడీపీ వార్డు కమిటీల ఎన్నిక

తణుకు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ వార్డు కమిటీల ఎన్నికలు నిర్వహించారు. గురువారం సాయంత్రం 2,11 వార్డులకు సంబంధించి కమిటీలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రకటించారు. 2వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులుగా నక్కా ఈశ్వర ప్రసాదు, రామదాసు త్రిమూర్తులు, 11వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులుగా మద్దినపూడి రామకృష్ణ శివరావు, కోళ్ళ ఆనందరావును ఎన్నుకొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అత్తిలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తణుకు ముళ్ళపూడి వెంకట రమణమ్మ మెమోరాయల్ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సింగులారిటీ చంద్రశేఖర్ తెలిపారు. సాధారణ పరీక్షలు, నేత్ర సమస్యలు, చిన్న పిల్లలు, స్త్రీల ప్రసూతి వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

18న పాలకోడేరు మండల సమావేశం

పాలకోడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న మధ్యాహ్నం 2 గంటలకు పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా తప్పనిసరిగా సమావేశంలో పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం



చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

అత్తిలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ళు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి అన్నారు. ఆరవల్లిలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

పాలకొల్లు టౌన్: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. 31వ వార్డులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి సత్యవాణి పర్యవేక్షణలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ లీగల్ సెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు బొంతు వెంకట తిరుమలరావు, పార్టీ నాయకులు సబ్బితి వెంకట రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరిస్తుందని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడీ చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించి , విద్యా కిట్‌లు పంపిణీ చేశారు.

భీమవరం టౌన్: భీమవరం 39వ వార్డు దుర్గాపురంలోని అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షర భాస్యం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, లక్ష్మి కాంతం, సరళ, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ పాల్గొన్నారు.

పెంటపాడు: పెంటపాడు ఆదర్శపాఠశాలలో కూటమి నాయకులు విద్యార్థుల సమక్షంలో కేకు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం శిరుమామిళ్ళ పెద్దిరాజు అధ్యక్షత వహించగా సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, నల్లమిల్లి చినగోపిరెడ్డి, కొప్పూరి లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.21 లక్షలు

మొగల్తూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని గత నెల నాలుగవ తేదీన ప్రారంభమైన జాతర ఈనెల 9న ముగిసింది. 27 రోజుల కాలానికి గానూ రూ.21లక్షల84వేల 37లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ తెలిపారు.

ఏవోగా భవానీ బాధ్యతలు

ఆకివీడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా భవాని గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఆమె ఆకివీడు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏవో శ్రీకర్ పదవీ విరమణ చేశారు. భవాని ఎంపీపీ కఠారి జయలక్ష్మిని కలిశారు.

ఇరగవరం టీడీపీ అధ్యక్షుడిగా గూడూరి



ఇరగవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇరగవరం మండలం తెలుగుదేశం పార్టీ నూ తన కమిటీ ఏర్పాటు సందర్భంగా గురు వారం ఇరగవరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో యువతను ప్రోత్సహించే విధంగా సీనియర్ నాయకులు చర్యలు తీసుకోవాలని పార్టీలో ఎవరూ తక్కువ కాదని తాను కూడా ఒక కార్యకర్తలా పార్టీ పటిష్టతకోసం పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఇరగవరం మండలం అధ్యక్షుడు గూడూరి నాగరాజును, ఆయన సేవలను ఎమ్మెల్యే రాధాకృష్ణ కొనియాడారు. కార్యదర్శి పోతిరెడ్డి శ్రీనివాసులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

5న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియావుద్దీన్ తెలిపారు. గురువారం కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి షేక్ జీయావుద్దీన్ మాట్లాడుతూ అదాలత్‌లో కక్షి దారులు రాజీయోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల డబ్బు, సమయం, ఆదా అవుతాయని తెలిపారు. కక్షి దారులు కోర్టు ఫీజు వెనక్కి వస్తుందని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

నరసాపురం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏడు ఆంధ్రా యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశాఖ సిబ్బంది రాము తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ శిబిరంలో 50 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తాన్ని దానం చేస్తారన్నారు.

119 పింఛన్ల మంజూరు

పాలకోడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలంలో కొత్తగా 119 స్పౌజ్ పెన్షన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పెన్షన్లను త్వరలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు.

ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : గొంతు కాన్సర్‌తో బాధ పడుతున్న మొగల్తూరు మండలం కేపీపాలెంకు చెందిన గుబ్బల విజయలక్ష్మీ కుమారికి వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు పంపిన రూ.10వేల చెక్కును ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు పట్టణంలోని తన నివాసంలో గురువారం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కోలమూరు, గ్రామం తోపాటు, సంబంధిత ఏరియాలలో ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. యండగండి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కూడా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

షీ టీమ్స్ ఏర్పాటు చేయాలి

భీమవరం రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమైన తరుణంలో విద్యార్థుల రక్షణ కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి బి.గణేష్ మాట్లాడుతూ భీమవరం పట్టణం జిల్లా కేంద్రం కావడంతో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థినిలు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారని, ఈ నేపథ్యంలో కొంత మంది ఆకతాయిలు విద్యార్థినులను ఇబ్బందికి గురిచేస్తున్నారని, అలాంటి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎస్.లక్ష్మణ్, పట్టణ ఉపాధ్యక్షురాలు బి.సింధు, పట్టణ కమిటీ సభ్యురాలు ఎన్.జ్యోతి, కె.రోహిత్, పి.సాయికృష్ణ పాల్గొన్నారు.